కథ

**యా**దృచ్ఛికం లేక కాకతాళీయం అంటే ఇదేనేమో! కాకపోతే మరేమిటి? ఇద్దరిదీ ఒకటే వీధి- ఇద్దరివీ ఎదురెదురు ఇళ్లు- ఇద్దరిదీ ఒకటే వయస్సు- ఇద్దరూ ఒకటి రెండు రోజుల తేడాగా ఇళ్లు విడిచి వెళ్లిపోయారు. మళ్లీ దాదాపుగా ఇరవై రెండేళ్ల తర్వాత ఒకటి రెండు రోజుల వ్యవధిలో తిరిగి ఇళ్లకు చేరుకున్నారు.

# నోష్మ మంత్రం

ప్రతాప రవిశంకర్



ఒకరికి ఘన స్వాగతం!

మరొకరికి ఘన తిరస్కారం!

ఏమిటీ వ్యత్యాసం? ఇదంతా ఎందులో వుంది?

ఇలా కాదు. ఒకరొకరి కథనీ విడివిడిగా చెబితేగానీ మీకు అర్థం కాదు. ముందుగా సూర్యారావు కథ-

సూర్యారావు చాలా సాధారణమైన మనిషి. అతను మధ్యతరగతికి చెందినవాడు. అతని తండ్రి ఆ వీధిలోనే ఓ వీధి బడిని నడిపేవాడు. ఆ బడిమీద వచ్చిన సంపాదనతోనే భార్యా ముగ్గురు పిల్లలను పోషించేవాడు. ఇంటర్మీడియట్ ఫెయిలయ్యేవరకూ సూర్యారావును చదివించాడు. చదువులో ముందుకు వెళ్లలేని సూర్యారావు కొన్నాళ్లు తనలాంటి స్నేహితులతో కలిసి చిల్లర తిరుగుళ్లు తిరిగాడు. వీలుననుసరించి చిన్న చిన్న దొంగతనాలకు అలవాటుపడుతున్నాడని ముందుగా సూర్యారావు తల్లి సుభద్రమ్మ గమనించింది. ఆమెకు తెలిసి అతను ముందుగా పక్కింటివాళ్ల అలారం గడియారాన్ని కొట్టేశాడు. ఈ విషయాన్ని భర్తకు చెప్పిందామె.

అప్పుడా బాధ్యతగల తండ్రి సూర్యారావును ఓ సినిమాహాల్లో టిక్కెట్లు ఇచ్చే ఉద్యోగంలో పెట్టించాడు. అక్కడ కూడా అతను తన సహజత్వాన్ని ప్రదర్శించాడు. చిల్లర డబ్బులు నొక్కడం మొదలుపెట్టాడు. ఆ ఉద్యోగం అంతటితో వూడిపోయింది. ఆ తర్వాత అతను ఎన్నో రకాల వుద్యోగాలు చేశాడు. ఎందులోనూ స్థిరంగా వుండలేకపోయాడు.

సరిగ్గా ఇలాంటి పరిస్థితుల్లోనే అతను పెళ్లీడుకు ఎదిగిపోయాడు. సూర్యారావుకంటే ముందుగానే ఎదిగిన ఇద్దరు ఆడపిల్లలకు అతని తండ్రి దగ్గరి బంధువుల్లోనే తగిన సంబంధాలు చూసి పెళ్లిళ్లు చేశాడు. చివరగా సూర్యారావు పెళ్లి కూడా చూసి తృప్తిగా ఈ లోకాన్ని వదిలి వెళ్లిపోయాడు.

తండ్రి పోవడంతో కుటుంబ బాధ్యత పూర్తిగా సూర్యారావుమీద పడిపోయింది. అక్కల పెళ్లిళ్లకు తండ్రి చేసిన కొన్ని అప్పులు కూడా తండ్రి మిగిల్చిన పాత పెంకుటింటితో పాటు సూర్యారావుకు సంక్రమించాయి.

చూస్తుండగానే కొన్నేళ్లు గడిచిపోయాయి. సూర్యారావు భార్యని ముగ్గురు పిల్లల తల్లిని చేశాడు. తల్లి రోగాలకు సరయిన మందులు ఇప్పించకుండా ఆమెను కూడా తండ్రి దగ్గరకు పంపించాడు.

చివరకు కుటుంబాన్ని పోషించుకోటం సూర్యారావుకు కష్టమయ్యింది. స్థిరత్వంలేని సూర్యారావు జీవితం దొర్లుతున్న రాయిలా తయారయ్యింది.

ఒకరోజు రాత్రి సూర్యారావు తీవ్రంగా ఆలోచించాడు. చివరకు ఓ నిర్ణయానికి వచ్చాడు. దాని ఫలితం సూర్యారావు తెల్లారి ఇంటినుంచి మాయమైనాడు. ఎక్కడికో వెళ్లాడనీ, తిరిగి వస్తాడనీ అతని భార్య సుమతి ఎదురుచూసింది. ఇంకో రెండురోజులు ఎదురుచూసింది. కానీ సూర్యారావు రాలేదు. అతని జాడ తెలీదు. ఇంకొన్నాళ్లు గడిచాయి. సూర్యారావు ఇంటికి తిరిగిరాలేదు.

అప్పుడు భార్య సుమతి యేడ్చింది. పిల్లలు చిన్నవాళ్లు కాబట్టి ఈ విషయమై యేడ్వలేదు. ఆకలితో ఏడ్చారు. కొంతమంది సూర్యారావు కుటుంబాన్ని పోషించలేక ఆత్మహత్య చేసుకున్నాడని అన్నారు. ఇంకొంతమంది తీవ్రవాదుల్లో కలిసిపోయాడని అన్నారు. సుమతి ఎటూ తేల్చుకోలేకపోయింది. చివరకు బతుకుతెరువు మార్గాలను అన్వేషించింది.

విస్తళ్లు కుట్టింది. న్యూస్‌పేపర్లతో కవర్లు తయారుచేసింది. పచ్చళ్లు తయారుచేసి అమ్మింది. తెలిసిన వాళ్ల ఇళ్లలో చిన్న చిన్న పనులు చేసింది. కొన్నాళ్లు వంటలు చేసింది. ఇలా రకరకాల పన్లుచేసి పిల్లల్ని పెద్దచేసింది.


పిల్లలు పెద్దవాళ్లయిపోయారు.

తండ్రి చనిపోయి వుంటాడని తల్లితోపాటు వాళ్లు కూడా నిర్ణయించుకున్నారు. అప్పుడు వాళ్లకు నమ్మకస్థుడయిన ఓ మనిషి ద్వారా సూర్యారావు గురించిన ఓ వార్త తెలిసింది. అదేమిటంటే సూర్యారావు దొంగల్లో కలిసిపోయాడని.

భర్త బతికున్న వార్త తెలిసినందుకు సుమతి ఏ మాత్రం సంతోషించలేదు. సంతోషించి ఉపయోగం ఏమిటి? తన కష్టాలు తనని వీడిపోవు. బొట్టు, గాజులు తీసేయాల్సిన అవసరం లేదని మాత్రం తెలుసుకున్నది.

కనీసం సూర్యారావు ఇంటికి ఓ ఉత్తరం రాసినా బావుండేదేమో! కానీ అతనలా చెయ్యనందుకు అంతా అతనిని దుర్మార్గుడనీ, స్వార్థపరుడనీ ఇలా రకరకాలుగా అనుకున్నారు. తల్లితోపాటు పిల్లలక్కూడా తండ్రిమీద ద్వేష భావం క్రమక్రమంగా పెరిగిపోయింది.

సూర్యారావు పెద్దకూతురు నందిని హోటల్లో పనిచేసేవాడితో లేచిపోయింది- ఇక



### తెలివంటే అదీ!

ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు సుభాష్ ఘై, నటి అమృతాఅరోరాకు ముంబయిలోని బాంద్రాలో ఓ ఖరీదైన ఫ్లాట్ కొని పెట్టాడు. అమృత చేసిన చిత్రాలు 'కిత్‌నే దూర్ కిత్‌నే పాస్, ఆవారా పాగల్ దీవానా' ఫ్లాపైనా సుభాష్, అమృతను తన తరువాతి చిత్రం 'ఏక్ ఔర్ ఏక్ గ్యారహ్'లో తీసుకున్నాడు. ఆ చిత్రం కూడా ఫ్లాపైనా, ఘై మరో చిత్రంలో తీసుకోవటమే కాకుండా, ఫ్లాట్ కొని పెట్టటం బాలీవుడ్ జనం అందరికీ ఆశ్చర్యం కలిగించింది. అమృత ఏం చక్రం తిప్పిందో ఏమో మరి!

తనకు సవ్యంగా పెళ్లికాదని తెలుసుకున్న తర్వాత.

ఆరాత్రి సుమతి కుమిలి కుమిలి ఏడ్చింది. తమని అలా వదిలేసి దొంగల్లో కలిసిపోయిన భర్త సూర్యారావును ఆ రాత్రంతా తిడుతూనే ఉంది. ఏదో ప్రెస్‌లో పనిచేస్తున్న కొడుకు విష్ణుమూర్తి కూడా తండ్రిని కసిదీరా తిట్టాడు. తండ్రిని అలా తిట్టిపోస్తున్న ఆ ఇద్దరినీ చూస్తూ ఉండిపోయింది. రెండో కూతురు సువర్చల.

డబ్బు సంపాదించడమే ధ్యేయంగా పెట్టుకున్న సూర్యారావుకు ఇవన్నీ తెలీదు. ఇంటినుండి వెళ్లిపోయిన కొన్నాళ్లు తనవాళ్ల గురించి ఆలోచించాడు కానీ తర్వాత అతడి ఆలోచనలన్నీ డబ్బుమీదకు మళ్లాయి. తర్వాత కొంతమందిని కూడగట్టి చిన్న చిన్న దొంగతనాలు చేశాడు. పట్టుబడి జైలుశిక్షలు అనుభవించాడు. మళ్లీ కొంచెం పెద్ద దొంగతనాలు చేశాడు. డబ్బు కూడబెట్టాడు. ఏ డబ్బు తనకు లేక తను కష్టాలు పడ్డాడో ఆ డబ్బును తను బాగా సంపాదించాలి. కష్టాలను డబ్బుతో కొట్టాలనుకున్నాడు.

ఈ తాపత్రయంలో అతను భార్యాపిల్లల్ని పూర్తిగా గాలికి వదిలాడు. అన్నింటినీ డబ్బుతో కొన్నట్టే భార్య సుఖాన్ని కూడా కొనుక్కున్నాడు. కొన్ని రకాల రోగాలను కూడా సంపాదించాడు. మళ్లీ జైలుకు వెళ్లివచ్చాడు. సూర్యారావు ఇలా జైలు బయటకీ, లోపలికీ తిరుగుతున్నప్పుడే కాలం గిర్రున తిరిగి ఇరవైరెండేళ్లు గడిచిపోయాయి.


డబ్బు లెక్క చూసుకుంటే బాగానే సంపాదించాడు. ఇక జైలుకు వెళ్లగూడదని తను సంపాదించిన డబ్బుతో ఇంటికి తిరిగివెళ్లి భార్యాపిల్లల్ని సుఖపెట్టాలనీ అనుకున్నాడు.

ఇలా అనుకున్నప్పుడే అతనికి తన ఊరివాడు కనిపించి అతని కుటుంబ వివరాల గురించి చెప్పాడు. వాడికి తను ఏదో వ్యాపారం చేస్తున్నట్టు చెప్పాడు సూర్యారావు.

పెద్దకూతురు లేచిపోయి పెళ్లిచేసుకున్నందుకు అతను కొంచెం బాధపడ్డాడు. ఇంటికి వెళ్లగానే మిగిలిన ఇద్దరు పిల్లలకీ తగిన సంబంధాలు చూసి పెళ్లి చెయ్యాలనుకున్నాడు. ఇలా అనుకున్న తర్వాత అతను తను ఎంత డబ్బుతో తిరిగి వస్తున్నాడో తెలియజేస్తూ భార్యపేరున ఓ ఉత్తరాన్ని రాశాడు.

రాసినట్టుగానే అతను ఇరవైరెండేళ్ల తర్వాత తన వూరికి బయల్దేరాడు. అతను రైల్లో ప్రయాణంచేస్తున్నప్పుడు అతనికి ఓ సందేహం కలిగింది. భార్య తనని క్షమిస్తుందా? పిల్లలు తనని ద్వేషించకుండా వుంటారా? ఇన్నేళ్లు తమని కష్టాలకు ఎరగావేసి వెళ్లినందుకు వాళ్లు తనని ఆ ఇంట్లోకి సాదరంగా ఆహ్వానిస్తారా? ఆ ఇంట్లో తనకు స్థానం లేదని బయటకు పంపిస్తారా? ఇలాంటి ఆలోచనలు ఎన్నో వచ్చాయి.

సూర్యారావుకు వచ్చిన ఇలాంటి ఆలోచనలను, సందేహాలను సమూలంగా




నరికివేస్తూ ఆ ఇంట్లో అంతా అతన్ని ఘనంగా ఆ ఇంట్లోకి ఆహ్వానించారు. ఖరీదైన సూట్‌లో కారులో దిగిన భర్తని చూసి భార్య సుమతి కన్నీరు కార్చింది. పిల్లలు కూడా తల్లి కన్నీటితో తండ్రిని గుర్తుపట్టి అతని దగ్గరకు వెళ్లారు. అప్పుడు తను ఎంతగానో సంతోషించి తను భార్యాపిల్లలకు తీసుకువచ్చిన ఖరీదైన కానుకలను వాళ్లకు అందజేశాడు. తండ్రి వచ్చాడని తెలిసి హోటలు వాడితో లేచిపోయి ఆ వూళ్లోనే కాపురం పెట్టిన పెద్దకూతురు కూడా వచ్చింది. భార్యతోపాటు వాళ్లందరికీ కూడా తను కొన్నిరకాల వ్యాపారాలు చేసినట్టు, బాగా డబ్బు సంపాదించినట్టు చెప్పాడు సూర్యారావు. వాళ్లందరూ ఆ మాటలను నమ్మినట్టు నటించారు. ఆ వూళ్లో తను ప్రారంభించదలుచుకున్న కొన్ని వ్యాపారాల గురించి కూడా సూర్యారావు అప్పటికప్పుడే ఓ ప్రకటన చేశాడు. ఎవరెవరి పేరున ఎంతడబ్బు బ్యాంక్‌లో వెయ్యదల్చుకున్నదీ కూడా చెప్పాడు.

అప్పటివరకూ కష్టాల చక్రంలో పడి నలిగిపోయిన అతని భార్య మొహం ఓ కొత్త కళతో వెలిగిపోవటాన్ని గమనించి సూర్యారావు నవ్వుకున్నాడు. పిల్లల మొహాల్లోనూ అదే వెలుగు. అదే తృప్తి. తను సృష్టించిన ఇరవైరెండేళ్ల నరకాన్ని ఒక్కసారిగా మరిపింపజేసింది. తను కాదనీ, తనరాక కాదనీ సూర్యారావుకు తెలుసు. అందుకే అతను మళ్లీ మళ్లీ నవ్వుకున్నాడు.

ఆ రాత్రి అతనికి సంతోషంగానూ, భయంతోనూ నిద్రపట్టలేదు. తిరిగి తన కుటుంబంలో ఒక్కడిగా చేరిపోయినందుకు సంతోషం కలిగింది. తన గత జీవితం తాలూకు నీడలు తిరిగి తనమీద పడతాయేమోననుకుంటే భయం కలిగింది.

ఇలా రెండురోజులు గడిచాక తర్వాత మూడో రోజున అతనికో విషయం తెలిసింది. ఆ రోజునే సుందరం ఇంటికి తిరిగివచ్చాడని.

ఇక సుందరం కథ-

సూర్యారావు ఎదురింట్లో వుండే సుందరం కూడా మధ్యతరగతివాడే. అతని తండ్రి ఓ బట్టల షాపులో గుమాస్తాగా వుండేవాడు. సుందరం కూడా చదువులో అంత చురుకయిన వాడు కాకపోవటంతో అతన్ని కూడా తను పనిచేసే షాపులోనే గుమాస్తాగా పెట్టించాడు. అలా గుమాస్తా పనిచేస్తున్న సుందరానికి పెళ్లీడురాగానే తండ్రి పెళ్లి చేశాడు. అతని భార్యపేరు చాముండి. ఆమె అందమైనదీ కాదు అనాకారీ కూడా కాదు. మంచి మనిషే గానీ కోరికలు ఎక్కువ. భార్య కోరికలన్నీ డబ్బుతో తీరేవి మాత్రమే కావడంతో సుందరం కంగారు పడ్డాడు.

భార్య కోరికలలో నాలుగోవంతు కోరికలను తీర్చటానిక్కూడా అతని సంపాదన చాలేదికాదు. ఇలాంటి పరిస్థితులలో సుందరం ఓ అబ్బాయికి తండ్రయినాడు. అతని తల్లి ఏదో రోగంతో చనిపోయింది. ఆ దిగులుతో తండ్రి మంచాన పడ్డాడు.

ఆ తండ్రి కూడా ఇంకోనెలలో చనిపోతాడనగా సుందరం భార్యని ఓ ఆడపిల్లకు తల్లిని చేశాడు. తన సంపాదనతో భార్య గొంతెమ్మ కోరికల మధ్య ఆ ఇద్దరు పిల్లల్ని పెంచడం చాలా కష్టమయ్యింది.

అప్పటికీ అతను చాలా కష్టపడేవాడు. పొద్దున వెళితే రాత్రి పదిగంటలకు తిరిగివచ్చేవాడు. డబ్బును అతను చాలా జాగ్రత్తగా ఖర్చు చేసేవాడు. కానీ ఏం లాభం? ఆవారా భార్య దుబారా చేసేది. ఇంకా అతని సంపాదన చాలడంలేదని అతన్ని వీలుదొరికినప్పుడల్లా సాధించేది చాముండి.

ఒకరోజు సుందరం తన బాధను ఎదురింటి స్నేహితుడయిన సూర్యారావుకు చెప్పుకున్నాడు. అప్పుడతనికి ఏదైనా బ్యాంక్ దోపిడీ చెయ్యమని సలహా ఇచ్చాడు సూర్యారావు నవ్వుతూ-

ఇలా కొన్నేళ్లు అసంతృప్తిగా గడిచాయి.

ఆ రోజు సుందరానికి ఎదురింట్లో సూర్యారావు వెళ్లిపోయాడని తెలిసింది. ఎందుకు వెళ్లిపోయాడో అతను వూహించగలిగాడు. ఆ రాత్రంతా ఆలోచించి పెళ్లిచేసుకొని తను పొరపాటు చేసినట్టు గ్రహించాడు.

ఇలా గ్రహించిన రెండు రోజుల తర్వాత సుందరం కూడా ఇంట్లోనించి వెళ్లిపోయాడు. అతని ఆచూకి గురించి భార్య చాముండి చాలా ప్రయత్నాలు చేసింది. ఫలించలేదు. అసమర్థుడు భార్యాపిల్లల్ని పోషించలేక వెళ్లిపోయాడనుకున్నది.

కొన్నాళ్లు చూసి పుట్టింటివాళ్లు చాముండికి ఓ కుట్టుమిషను కొనిచ్చారు. దాన్ని ఆధారం చేసుకొని చాముండి ఇద్దరు పిల్లల్ని పెంచడం మొదలుపెట్టింది.

సుందరం ఇంట్లోనించి వెళ్లిన మూడేళ్ల తర్వాత అతడి గురించిన జాడ తెలిసింది చాముండికి. అతను సాధువుల్లో కలిసి పోయినాడట. షిరిడీలో ఎవరికో కనిపించాడట.

ఆ వార్త చాముండిని ఏమాత్రం సంతోష పెట్టలేకపోయింది. తన సుఖం తను చూసుకున్నా డనుకున్నది. అప్పటికీ, తను ఎక్కువ డబ్బు సంపాదించడానికి భర్తకు కొన్ని మార్గాలను సూచించింది. కానీ సుందరం ఒప్పుకోలేదు. గానుగెద్దులా ఆ బట్టల షాపులో గుమాస్తాగానే జీవితాంతం బతుకుతాననేవాడు. ఈ విషయంలోనే భార్యాభర్తలిద్దరికీ వాదనలు జరిగేవి. చివరికి అలిసిపోయి సుందరం నిద్రపోయేవాడు.

రోజంతా కష్టపడేది చాముండి. ఆ సంపాదనతోనే పిల్లలిద్దర్నీ కొంతవరకూ చదివించింది. తల్లి, తండ్రి తానే అయి తనని పెంచుతున్న తల్లిని చూసి కొడుకు బాధ పడేవాడు. తమనలా వదిలి వెళ్లిపోయిన తండ్రిని తల్లి ఎదురుగానే తిట్టేవాడు. ఆడపిల్ల తిట్టేది కాదు గానీ తమకు తండ్రి ప్రేమ లేకుండా చేసినందుకు మనసులోనే ద్వేషించేది.

సుందరం కొడుకు చదువు ఆపేసి ఓ టొబాకో కంపెనీలో ఉద్యోగానికి కుదిరిపోయాడు. కూతురు పెళ్లీడుకు వచ్చి తనూ మరో కుట్టుమిషనుతో తల్లికి సహాయపడుతోంది.

సూర్యారావు పెద్ద కూతురు లేచిపోయిన తర్వాత చాముండికి తన కూతురి గురించిన భయం పట్టుకుంది. కూతుర్ని లేచిపోవద్దనీ ఏదో ఒక విధంగా తగిన సంబంధం చూసి పెళ్లి చేస్తానని చెప్పింది. కూతురు సరేనన్నది.

అప్పుడు కూతురుకు సంబంధాలు చూస్తున్నప్పుడు సూర్యారావు తిరిగి వస్తున్నాడన్న వార్త తెలిసింది చాముండికి. తర్వాత రెండురోజులకు సూర్యారావునే చూసింది. ఆ తర్వాత ఆ కుటుంబ సభ్యుల సంతోషాన్ని చూసింది. ఒకవేళ సుందరం కూడా తిరిగివస్తే అనుకుంది. తను, తన పిల్లలూ అతన్ని ఇంట్లోకి సాదరంగా ఆహ్వానించ గలమా? అనుకున్నది.

ఇలా అనుకున్న మూడోరోజునే ప్రత్యక్షమయ్యాడు సుందరం- గడ్డాలూ, మీసాలతో, కాషాయ బట్టలతో, భుజానికో జోలెలాంటి సంచీ. ఇదీ అతని ఆస్తి.

అతి కష్టంమీద అతడ్ని గుర్తించిన చాముండి ఓ పురుగును చూసినట్టు చూసి పలకరించకుండానే లోపలకు వెళ్లిపోయింది. తండ్రి అని తెలుసుకున్న పిల్లలు అతడ్ని తిట్టి బయటకు నడవమన్నారు. తన ఇంట్లో తనే పరాయివాడిలా అయిపోయాడు సుందరం.

తను ఘోరమయిన తప్పు చేశాననీ, తనని క్షమించమనీ, ఎలాగైనా జీవితాంతం వాళ్లను పోషిస్తాననీ, ఆ కుటుంబంలో ఓ సభ్యుడిగా తనని వుండనివ్వమనీ భార్యా పిల్లల్ని వేడుకున్నాడు. మొర పెట్టుకున్నాడు. అయినా వాళ్లు సాధుజీవితం మీద విరక్తి గలిగి తిరిగి తనవాళ్లతో కలిసి జీవించాలనే కోరికతో వచ్చిన సుందరం మొరను ఆలకించలేదు. బయటకు పంపేశారు.

రోడ్డు మీదకు వచ్చిన సుందరానికి ఎదురుగా వస్తున్న సూర్యారావు కనిపించాడు. అతను సూటులో వున్నాడు. పెదవుల మధ్య ఖరీదైన సిగరెట్టు వుంది.

"మళ్లీ వెళుతున్నాను" అన్నాడు సుందరం.

"సారీ" అన్నాడు సూర్యారావు.

"ఇద్దరిదీ ఒక్కటే కథ... కానీ ముగింపు మారింది" అన్నాడు మళ్లీ సుందరం.

"కొన్ని ముగింపులు మారవు" అన్నాడు సూర్యారావు నవ్వుతూ.

"సాధువుగా దేశమంతా తిరిగాను. ఎంతో జ్ఞానాన్ని సంపాదించుకున్నాను. కానీ ఇప్పుడు నాకు జ్ఞానోదయం కలిగింది. ఇన్నేళ్ల తర్వాత నేను తిరిగివచ్చినా నా భార్యా పిల్లల మనసుల్లో సంతోషం లేదు. నా తప్పును క్షమించే ఉద్దేశం కూడా లేదు. ఎందుకంటే నీలా నేను డబ్బుతో తిరిగి రాలేదు కాబట్టి. ఇప్పటికీ మనుషుల మధ్య ఆర్థిక బంధాలే తప్ప మానవ సంబంధాలు మొదలుకాలేదు. అందుకే నేను మళ్లీ తిరిగి రాను" అని వెళ్లిపోయాడు సుందరం. ■

## సక్సెస్ తలకెక్కిందా?

అలా జరగటం సహజం. "కానీ రితిక్ రోశన్‌కు కూడానా?" అని ఆశ్చర్యపోతున్నార్ట బాలీవుడ్ జనం. 'కోయీ మిల్ గయా' చిత్రం హిట్టవటానికి దర్శకత్వం, సంగీతం, స్క్రిప్ట్, కథనంలో వైవిధ్యం, రితిక్ నటన-ఇలా రకరకాల కారణాలు అందరూ చెప్పుకుంటుంటే, రితిక్ ఏమన్నాడో తెలుసా? "నా దగ్గరికి డాడీ బోలెడన్ని స్క్రిప్టులు తీసుకొచ్చి, చదివి వినిపిస్తే, ఎన్నిటినో తిరస్కరించాను. చివరికి ఇది నచ్చింది, హిట్టయింది" అంటే స్క్రిప్ట్ ఎంపికలో తన నైపుణ్యం గురించి చెబుతున్నాడా, లేక హిట్ చిత్రం తాలూకు సక్సెస్ తలకెక్కినట్లేనా?

